

# ప్రవాహిని గట్టు

సత్యం శంకరమంచి

కృష్ణా ప్రవాహాన్ని చీల్చుకుంటూ దోవచేసుకు పోతూంది ముక్త్యాలపోయే లాంచి. లాంచి పోతున్న వేగానికి ఎత్తుగా లేచిన అలలు ఎగిరి పడుతూ వేగంగా ఒడ్డుమీదికి పరుగెత్తి విరిగి పడుతున్నాయి. గోపాలం కాబిన్ కిటికీలోంచి ఒడ్డువైపు చూస్తున్నాడు. గట్టుమీద లీలగా కన్పిస్తున్న తల్లితండ్రులు, తన్ను పంపటానికి వచ్చిన స్నేహితులు, తను ఇంత కాలం పుట్టి పెరిగిన ఊరు, దేవాలయ శిఖరాలు, స్నానాల రేవు, రేవులో పడవలు, రేవుగట్టుమీద చింత చెట్లు — అన్నీ దూరమై పోతున్నాయి. తను అన్నింటికీ దూరమైపోతున్నాడు.

అందరూ 'నువ్వక్కర్లేదు' అని తరిమేస్తున్నట్లనిపించింది గోపాలానికి. రేవు బాగా దూరమైపోయింది. తను ఒంటరిగా మిగిలాడు. ఒంటిగా వెళ్ళిపోతున్నాడు. ఒంటరిగా వెళ్ళినా హాయిగా ఉండేది. లౌకిక బరువులు, బిగించిన సంకెళ్ళు —కాబిన్‌లో కూర్చుంటే బయట నీళ్ళు తన కంఠం మట్టాన ఉన్నాయి. నీళ్ళ సారంగం లోకి పోతున్నట్టుంది గోపాలానికి. చూపు కాబిన్ లోకి మళ్ళించాడు. దాన్నిండా తనెక్కడ సుఖపడిపోతాడోనని నెత్తినవేసి కట్టినసామాను. పెట్టెలు, పక్క చుట్టలు, బియ్యంబస్తా, కందిపప్పు టిక్కీ, ఊరగాయ జాడీలు, పక్కనే ఒదిగి కూర్చున్న వరలక్ష్మి అనే భార్యారత్నం.

గోపాలం వరలక్ష్మిని మొదటిసారిగా పరిశీలనగా చూశాడు. గుండ్రటి ముఖం, చిన్న నుదురు, ఆ చిన్న నుదుటిమీద పెద్ద కుంకం బొట్టు, చెవులకు పాత కాలపు లోలకులు, మెడ కింద ఎండిపోయిన గంధం. మెళ్లో వాళ్ల నాయనమ్మ జిగినీ గొలుసు, దాని వెనకగా తన రెండు చేతులతో మూడు ముళ్ళు వేసిన మంగళసూత్రం, పమిట మెడనిండా కప్పుకున్న కొత్తకల నేతచీర, కాళ్లకు పాంజీబులు, వేళ్లకు మట్టెలు, పాదాలకు రాసుకున్న పసుపు, ఆ పసుపును పులుముకుంటున్న చీర చివర్లు — 'ఈ అమ్మవారితోనా తను జీవితాంతం గడపబోయేది' — అనుకున్నాడు గోపాలం. భర్త తన్ను గమనిస్తున్నాడని తెలిసి చీర చివర్లే చూస్తూ ఊపిరి బిగబట్టి కూర్చుంది వరలక్ష్మి.

గోపాలం మళ్లీ చూపు నీళ్లవైపు మళ్లించాడు. కొంచెం దూరంలో చిన్న డింగీ పడవ బుల్లి తెరచాప ఎత్తుకుని వాలుగాలికి రయ్యిన దూసుకుపోతూంది. ఆ డింగీ చుక్కాని పట్టి పిల్లవాడొకడు గోచీ పెట్టుకుని హాయిగా ఆకాశం వైపు చూస్తున్నాడు. స్వేచ్ఛా ప్రపంచాన, స్వచ్ఛమైన జలరాశిలో తన డింగీ పడవ వేసికొని రయ్యిన పోతూ వందనస్వీకారం చేస్తున్నట్టున్నాడు ఆ గోచీ పిల్లవాడు. వాడే స్వేచ్ఛా స్వరూపం. ఆ గోచీ పిల్లవాడివైపు చెయ్యి ఊపుదామనుకున్నాడు గోపాలం. అప్పుడే డింగీ చాలాదూరం వెళ్లిపోయింది. గాలిలో కాగితం ముక్కలా తెరచాప నీళ్లమీద తేలి కన్పిస్తూంది. కొంచెంసేపట్లో ఆ తెరచాపకూడా దూరమైంది. తిరిగి గోపాలం దృష్టికి అఖండ జలప్రవాహం కన్పిస్తూంది.

మొదట్నించీ గోపాలం జీవితానికి సంబంధించిన విషయాలు అతని ఇష్టంతో నిమిత్తం లేకుండానే జరుగుతూ వచ్చాయి. ఎవరో ఒకరు నిర్ణయాలు చేసేవారు. గోపాలం అనుభవించేవాడు. స్కూల్‌ఫైనల్ కాగానే తండ్రి టీచర్ ట్రెయినింగ్‌లో చేర్పించాడు. ట్రెయినింగ్ పూర్తి కాగానే తల్లి ఒక పిల్లను చూసొచ్చి పెళ్లి స్థిరపరచింది. పెళ్లికాగానే మేనమామ ముక్త్యాలలో టీచర్ ఉద్యోగం ఖాళీ ఐంది రమ్మని ఉత్తరం రాశాడు. ఉత్తరం అందిన మూడు రోజుల్లో కొత్త సంసారానికి కావాల్సిన సామాను కూర్చి, పెళ్లాన్ని చేర్చి, లాంచీ ఎక్కించేశారు, తన వాళ్లంతా. నిజానికి గోపాలానికి టీచర్ ట్రెయినింగ్ చదవడం ఇష్టంలేదు. పెళ్లి, పెళ్లాం, ఉద్యోగం ఏవీ ఇష్టంలేవు. 'తన జీవితగమనానికి తన ఇష్టాలకు సంబంధం లేదు కాబోలు' అనుకున్నాడు గోపాలం.

ప్రవాహంలో ఒక పాలేరు ముందున్న గొడ్లను మళ్లిస్తూ జాలు కెదురుగా తెప్ప కొయ్యమీద సర్రున ఈదుకుంటూ పోవటం కన్పించింది గోపాలానికి. గోపాలం ఆ దూసుకుపోతున్న తెప్ప కొయ్యవైపు, ఆ నల్లటి పాలేరువైపు, బారలు బారలుగా ఈదుతున్న అతని బలమైన చేతుల వైపు ఆశగా, అసూయగా చూశాడు. లాంచీ కుతకుత ఉడుకుతూ ముందుకు నడిచింది. లాంచీ మోత విని ఒడ్డుమీద నుంచి గాలిలో కెగురుతున్న తెల్లటి కొంగలు, లంకలో గాలికి హాయిగా తురాయిల్లా ఊగుతున్న రెల్లుపూలు, ఆ పక్కనే నిశ్చింతగా పిల్లంగోవి ఊదుకుంటూ పశువులను మేపుతున్న కుర్రాడు — వీళ్లను చూస్తూంటే తన్నెవరో కుళ్ల పొడుస్తున్నట్టు, తనలో నెత్తురు చచ్చిపోయినట్టు, తన చేతకానితనాన్ని హేళన చేస్తున్నట్టు బాధపడ్డాడు గోపాలం. 'ఏమైనా సరే. ముక్త్యాల వెళ్లగానే చెప్పేస్తాను– నేను మేష్టరు ఉద్యోగం చెయ్యనని' అనుకున్నాడు.

ఉద్యోగం మానేయచ్చు. కాని కట్టుకున్న

ఎలాంటి వారయినా సరే; మొదటి నుంచీ తమ జీవితానికి సంబంధించిన వన్నీ తమ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా జరుగుతున్నవంటే నిరసించక మానరు. తిరగబడతారు. సందేహమేమిః ఉద్యోగమంటే మానెయ్యవచ్చు. కాని కట్టుకున్న భార్యమాట వేరు. ఇప్పుడు ఆమె దోమతెరలో దూరిన దోమలాగా అతనిని బాధిస్తూంది.



పెళ్లాం? లాంచీమోత భరింపరానిదిగా ఉంది. చెవులు పగిలిపోతున్నాయి. ప్రవహిస్తున్న కృష్ణలోకి ఉరుకుదా మనుకున్నాడు గోపాలం.

'స్టాప్'. స్టీరింగ్ దగ్గర డ్రైవర్ గావుకేక పెట్టాడు.

ఇంజన్ మోత తగ్గి లాంచీ ఒడ్డు పట్టింది. గోపాలం బయటికి తొంగి చూశాడు. ఐదారుగురు ప్రయాణీకులు లాంచీ ఎక్కుతున్నారు. అందులో ఇద్దరు నవదంపతుల్లా ఉన్నారు. పసుపు నిండిన మధుపర్కాలు కట్టుకొని, క్రీగంట నవ్వులు అంది పుచ్చుకుంటూ ఒకరి వెనుక ఒకరు లాంచీ ఎక్కారు. వరలక్ష్మి ఆ కొత్త జంటను చూస్తున్నప్పుడు ఆమె కళ్లలో కాంతి వెలిగింది. సన్నగా చిరునవ్వు కదిలింది. గోపాలం వైపు చూసింది. గోపాలం ముఖం పక్కకు తిప్పుకున్నాడు. వరలక్ష్మి భర్త వాలకంచూసి చిన్నబుచ్చుకుందో, నిరుత్సాహపడిందో గోపాలానికి తెలియదు. వరలక్ష్మి సంతోషం, ఆనందం తనకు పట్టని విషయాలుగా ఉన్నాయి గోపాలానికి. ఇంతలో లాంచీ ఆసామీ వెంకటసామి వచ్చి పలకరించాడు—'బాబుగారూ! ఇక్కడ కులాసాగాఉందా' అంటూ.

'ఆఁ. ఉందిగాని, ఇంకెవర్నయినా ఇక్కడ కూర్చోపెట్టు' అన్నాడు గోపాలం.

'ఇక్కడి కెవరూ రార్లెండి. అవతలం సర్దుకుంటారు. ఏమన్నా కావాలంటే అడగండేం' అని వెళ్లిపోయాడు వెంకటసామి.

వెంకటసామి గోపాలం తండ్రికి చిన్నప్పటి నుంచీ తెలుసు. కాబిన్ రూంలో ఇంకెవర్నీ ఎక్కనీకుండా, వాళ్లిద్దర్నే కూర్చోపెట్టి ప్రత్యేకంగా ఏం కావాలో కనుక్కుంటున్నాడు. గోపాలానికి ఇంకెవరైనా వచ్చి కూర్చుంటే బావుండునని పించింది. కాని వెంకటసామి కట్టుదిట్టంచేసి తన్నీ కాబిన్ రూంలో బిగించాడు. దోమతెరలో దూరిన దోమలా ఎదురుగా వరలక్ష్మి గోపాలాన్ని బాధిస్తోంది.

లాంచీ మళ్లీ రొదచేసికొంటూ ముందుకు సాగింది. గోపాలం నీళ్లవేపే చూస్తున్నాడు. కృష్ణ తళ తళ మెరుస్తూ, కులుకుతూ తుళ్లింతలతో పరుగెత్తి పోతూంది. ఆ చైతన్య ప్రవంతిలో తన బతుకులా కదలకుండా ఉన్న నల్లబండరాళ్లు కన్పించాయి గోపాలానికి.

'వరలక్ష్మి తనవైపే చూస్తుందేమో!' అనుమానం వేసింది గోపాలానికి.

'ఏం చూస్తే?'

'ఎందుకు చూడాలి?'

'ఆమెకు చూడద్దనటానికి నువ్వెవరు?'

'తను పొందుతున్న కలవరాన్నిగుర్తిస్తుందా?'

'ఏం గుర్తిస్తే?'

'ఆమెకు తన వేదన తెలిస్తే రహస్యం రచ్చకెక్కినట్లయిపోదూ!'

'ఎప్పుడయినా తెలియాల్సిందేగా?'

'బాధ పడుతుందేమో?'

'నీకేం బాధపడితే?'

# ఆవతలి గట్టు

'నేనెందుకు ఆమెను బాధపెట్టాలి?'

'పోనీ సుఖపెట్టరాదూ?'

'ఎట్లు....ఎట్లా...'

గోపాలానికి ఒళ్లంతా సూదుల్లా గుచ్చుకుంటున్నాయి—వరలక్ష్మి చూడకుండా చూసిన చూపులు. ఆ చూపులు తన గుండెలో టార్చిలైట్లు వేసి వెతుకుతున్నట్లున్నాయి. గోపాలం మెల్లగా నీళ్లవైపునుంచి ముఖాన్ని కాబిన్‌లోకి మళ్లించాడు. వరలక్ష్మి తలవంచుకునికూర్చుంది. కాని, ఆవిడ కళ్లు తన్ను గమనిస్తూనే ఉన్నాయని ఖాయపరుచుకున్నాడు గోపాలం. వరలక్ష్మిని పలకరిద్దా మనుకున్నాడు.

'ఎందుకు పలకరించటం?'

'ఊరికినే.'

'ఏమని పలకరించటం?'

'ఏదో ఒకాటి.'

'లాంచీ కుదుపు బాధగాఉందిగదూ!' అన్నాడు గోపాలం.

వరలక్ష్మికి ఒళ్లు జలదరించింది. తలమరీ వంచుకుని పమిటకొంగు మరీ బిగిగా చుట్టూ కప్పుకుందికాని మాట్లాడలేదు. ఆమె పొందుతున్న భయానికి ఆశ్చర్య పడ్డాడు గోపాలం. కాస్త ఆగి మళ్లీ పలకరించాడు—

'మంచినీళ్లు కావాలా?' అని. అందులో అర్ధాంగిని అడుగుతున్న ఆప్యాయతలేదు.

వరలక్ష్మి చలించింది. ఈదురుగాలికి వణికిన మామిడి చివుళ్లలా కదిలాయి ఆమె పెదవులు. ఏదో అస్పష్టంగా ధ్వని వెలువడింది. అందులో అక్షరాలులేవు. అసలు గోపాలానికి ఆమె సమాధానంతో పనిలేదు. వరలక్ష్మి పడుతున్న అవస్థకు గోపాలానికి చిరాకు వేసింది. ఆమె ఎవరో ముక్కూ మొహమూ ఎరుగడు. ఆ లంగగా చుట్టుకున్న కలనేత చీరలో ఎంతమనిషుందో తెలియని ఈమెతోనా తన బతుకు తెల్లవారబోయేది—అనుకున్నాడు గోపాలం. కాస్త ఆగి గోపాలం ముఖం మళ్లీ నీళ్లవైపు తిప్పుకోబోతూ, వరలక్ష్మిని చూసి ఆశ్చర్యపోయాడు. వరలక్ష్మి తలవంచుకొని చిరునవ్వు నవ్వుకుంటూంది. ఆమె పెదవులు విచ్చుకుంటున్న పూరేకుల్లా ఉన్నాయి. గోపాలానికి భయం వేసింది.

'ఆమె ఎందుకు నవ్వుతూంది? తన్నుగురించా? తనకు దగ్గరగా జరుగుతూందా?'—చటుక్కున తల నీళ్లవైపు తిప్పుకోబోయాడు గోపాలం. అంతకంటే ముందే వరలక్ష్మి తల పైకెత్తి అడిగింది: 'మీకు కాఫీ ఇవ్వనా?' అని.

గోపాలం విస్తుపోయాడు. 'ఆ...ఊఁ...' అన్నాడు.

అసలు అక్కర్లేదని కటువుగా చెప్పాలను కున్నాడు.

వరలక్ష్మి గోపాలం సమాధానంకోసం చూడలేదు. లేచి పైన ఉన్న బుట్టలు పక్కకు పెట్టి కింద ఫ్లాస్కు తీసి కాఫీ పోసి ఇచ్చింది. గోపాలం తేరుకుని చూస్తున్నాడు. వరలక్ష్మిలో ఇంత ధైర్యం ఉందని తనకు తెలియదు. ఇంత త్వరగా ఇంత చొరవగా తన దగ్గరికి వస్తుందనుకోలేదు. తనకు తెలియదు కూడా. కాఫీ గ్లాసందుకున్నాడు. పరాయి వాళ్లెవరో తన పూజా మందిరంలోకి చొచ్చుకొచ్చి తిష్ఠవేస్తున్నట్లనిపించింది గోపాలానికి. నెత్తురు వేడిగా పొంగింది. ఏంచెయ్యాలో, ఏం చెయ్యకూడదో తెలియలేదు.

'బాగులేదు' అంటూ కాఫీగ్లాసుతో సహా కృష్ణలోకి విసిరేశాడు గోపాలం.

గోపాలం ముఖం నీళ్లవైపునుంచి మరల్చలేదు. తన వెనక వరలక్ష్మి ఖేదపడుతూందని, కంటనీరు పెట్టుకుంటూందని గోపాలానికి తెలియక పోలేదు. ముఖం కాబిన్‌లోనికి తిప్పటానికి భయంగా ఉంది. ఆ నాలుగడుగుల కాబిన్‌లో అగ్నిగోళాలున్నాయి. అక్కడ వినపడని ఆక్రందనలు, హాహాకారాలు.

లాంచీమోత మరీ ఎక్కువైంది. సరంగు లాంచీ పైకెక్కి గొట్టంలాంటిది పుచ్చుకొని ఒడ్డునున్న ప్రయాణీకులకు వినిపించేలా, 'లాంచీ ముక్త్యాల పోతోంది' అని అరుస్తున్నాడు. 'సరాసరి సముద్రంలోనికి పోనీకూడదూ' అనుకున్నాడు గోపాలం.

ఉన్నట్టుండి ఇంజన్‌రూంలో 'ఠాప్' అని మోత మోగింది. లాంచీ వాళ్లంతా గొల్లున ఇంజన్ రూంలోకి పరుగెత్తారు. కకావికలుగా అరుస్తున్నారు. ప్రయాణీకులు కూడా కొందరు కంగారుగా లేచారు. ఇంజను సాంతం ఆగిపోయింది. లాంచీని ఒడ్డు పట్టించారు. ప్రయాణీకులు, లాంచీవాళ్లు గోలగా అరుచుకుంటూ ఘర్షణ పడుతున్నారు. గోపాలం కాబిన్‌లోంచి



'ఉప్పొంగి పోయింది గోదావరీ!'

చిత్రం—గీత (విజయవాడ-1)

లేచి బయటకు వచ్చాడు. కొందరు ప్రయాణికులు ఒడ్డుమీది కెళ్లారు. లాంచీవాళ్లు వాళ్లందర్నీ సముదాయిస్తూ వివరంగా చెప్తున్నారు. దాని సారాంశం ఇది: లాంచీ పంకా విరిగిపోయింది. ఆ పనిముట్టు బెజవాడలోగాని దొరకదు. అది తీసుకొచ్చివేసి మళ్లీ లాంచీ బయలుదేరటానికి అయిదారు రోజులు పడుతుంది. గోపాలానికి దేమీ పట్టలేదు. లాంచీ ఆగిపోవటం అతనిలో ఏ ఆందోళనమూ కలిగించలేదు. గోపాలం నుంచున్న చోటుకు వెంకటస్వామి వచ్చి చెప్పటం మొదలెట్టాడు: 'ఏం చేస్తాం బాబూ! ఇట్లా వచ్చింది. ఇక్కడికి నాలుగుమైళ్లు తూర్పుగా బస్‌రోడ్ ఉంది. అక్కడ బస్సెక్కితే మెల్లగా ముక్త్యాల చేరచ్చు.''

'అహ' అన్నాడు గోపాలం ఒడ్డున పేరుకున్న రేగడిమట్టిని చూస్తూ.

మళ్లీ వెంకటసామి చెప్పటం మొదలెట్టాడు. 'లేకపోతే ఇక్కడికి ముక్త్యాలరేవు పదిమైళ్లుం టుంది. సరాసరి పడవ కట్టించుకున్నా కట్టించు కోవచ్చు.'

గోపాలం ఏమీ మాట్లాడలేదు.

వెంకటసామి అడిగాడు. 'అయితే ఏం చేద్దా మనుకుంటున్నారు?'

'ఏం చేస్తాం?' అన్నాడు గోపాలం.

వెంకటస్వామికి తనిందాకట్నుంచి చెప్పింది విన్నాడా లేదా అని అనుమానం వేసింది. 'అదే బాబూ. లాంచీ అయిదారు రోజులకుగాని బాగు పడదు. మీరు బండి కట్టించుకొని బస్‌రోడ్‌దాకా వెళ్లి బస్సెక్కుతారా? లేకపోతే పడవవేయించు కుంటారా?'

గోపాలానికి ఈ మాటలేవీ మెదడులో దూర లేదు. 'ఏం చెయ్యమంటావ్?' అన్నాడు.

'ఇప్పు డింకేంచేస్తాం? ఇంకో గంటలో పొద్దు గూకుతుంది. ఇక్కడికి ఊరు రెండుమైళ్లుంది. రాత్రి భోజనానికి కావలసినవేమైనా తెప్పించు కోండి. రేప్పొద్దున్న ఇద్దరం వెళ్లి బండో, పడవో చూద్దాం. మా కుర్రాళ్లు ఊళ్లో కెళ్తున్నారు. మీకేమన్నా కావలిస్తే చెప్పండి' అని వెళ్లిపోయాడు వెంకటసామి.

గోపాలాని కేమీ తోచలేదు. ప్రయాణికులు చాలామంది తక్కువ సామానులతో ఉన్నవాళ్లు కాబట్టి ఆ రాత్రి ఊళ్లో పడుకుని, పొద్దున్నే బస్సుకు వెళ్దామని లాంచీ దిగి వెళ్లిపోయారు. లాంచీలో లాంచీవాళ్లు, గోపాలం, వరలక్ష్మి మిగిలారు. గోపాలం అట్లాగే లాంచీ టాపు నాను కొని నిలబడ్డాడు. ఒడ్డుమీద కాసేపు నడుద్దా మనుకున్నాడు. రాత్రి భోజనం ఏర్పాట్లు చూడా లని జ్ఞాపకం వచ్చింది. కాబిన్‌లోకెళ్లి వరలక్ష్మితో మాట్లాడాలి. లాంచీ ఇట్లా మధ్యలో ఆగిపోయిన సంగతి వివరంగా చెప్పాలి.

'ఎందుకు మాట్లాడాలి? ఎందుకు చెప్పాలి?' అనుకున్నాడు గోపాలం.

'చెప్పటం నీ బాధ్యత.'

'నాకే బాధ్యతలూ లేవు. ఎవరో తెచ్చిపెట్టిన భారం. నేనెందుకు మొయ్యాలి?'

'ఆమె బాధపడుతుంది.'

'దానికి నా బాధ్యత లేదు.'

'నువ్వామెమీద పగ సాధిస్తున్నావు.'

'నే నెవరిమీదా పగ సాధించటంలేదు. నామీద నాకే పగ.'

గబగబా ఒడ్డుమీదికి నడిచివెళ్లాడు గోపాలం.

గోపాలం తిరిగొచ్చేటప్పటికి పొద్దుపోయింది. చుట్టూ చీకటి. లాంచీలో చిన్న లాంతరు ఒకటి వెలుగుతూంది. గోపాలానికి లాంచీ ఎక్కటానికి భయం వేసింది. కాబిన్‌లో వరలక్ష్మి ఉంటుంది. ఆమెతో మాట్లాడాలి. గోపాలం లాంచీ టాపు మీద కూర్చున్నాడు. ఆ చివరగా వెంకటసామి, లాంచీవాళ్లు మాట్లాడుకుంటున్నారు. ఇంతలో ఒక కుర్రాడు గోపాలం దగ్గరకొచ్చి 'అమ్మగారు పిలుస్తున్నారు' అని చెప్పి వెళ్లిపోయాడు. గోపాలం 'సరే' అన్నాడు కాని కాబిన్‌లోకి వెళ్లదల్చుకోలేదు. వెంకటసామి, కుర్రాళ్లు తనవైపు చూస్తుం డటం గమనించి బావుండదని కాబిన్‌లోకి వెళ్లాడు. అక్కడ చిమ్నీ దీపం వెలుగుతూంది. ఆ గుడ్డి వెలుగులో మూలగా వరలక్ష్మి నుంచుని ఉంది. వరలక్ష్మి ముఖం సరిగ్గా కనపడ్డం లేదు. కనిపించినా గోపాలం చూడ దలచుకోలేదు. ఎదురుగా బల్లమీద విస్తట్లో వడ్డించిన భోజనం కన్పించింది. భోజనం చూసేటప్పటికి గోపాలానికి పెద్దకోపం వచ్చింది. ఆ రాత్రి తను పస్తు పడుకోవా లనుకున్నాడు. వరలక్ష్మి కూడా మాడాలనుకున్నాడు. లోపల ఆకలి వేస్తున్నా తను ఉండదనుకున్న భోజనం, ముఖ్యంగా వరలక్ష్మి వడ్డించిన భోజనం, ఎదురుగాచూసి కోపం పట్టలేకపోయాడు.

'ఎక్కడిది ఇదంతా?' దిగుడు బావిలో రాళ్లు పగలగొడుతున్న స్వరాన్ని పోలి ఉంది గోపాలం గొంతు.

వరలక్ష్మికి మాట పెగల్లేదు. తడబడుతూ చెప్పింది. 'అత్తయ్య... కారియర్‌లో పెట్టి ఇచ్చారు'.

గోపాలానికి మళ్లీ అనడాని కేమీ దొరకలేదు. అన్నం ముందు కూర్చున్నాడు. ఆకలిగా ఉన్నా తిన బుద్ధి కాలేదు. తనకు అన్నం తినగానే పాలుతాగే అలవాటు. 'పాలుంటే బావుండును' అనుకున్నాడు. 'పాలుకాదు. తాగటానికి విషం కూడా ఉండదు' అనిపించింది గోపాలానికి. నాలుగు మెతుకులు నంజి చెయ్యి కడుక్కున్నాడు. చెయ్యి కడుక్కుని వెనక్కు తిరిగేప్పటికి ఎదురుగా పాలగ్లాసుతో వరలక్ష్మి నుంచుని ఉంది. పాలను చూసేటప్పటికి గోపాలానికి మళ్లీ కోపం వచ్చింది. తను పాలులేకుండా బాధపడదామనుకున్నాడు. కావాలనుకున్న దేమైనా, తను వద్దనుకుంటున్న వరలక్ష్మి అందిస్తూంది. వదిలించుకుందామంటే తన్నింకా బిగిస్తూంది.



అద్దంలో అందం

చిత్రం—డి. దేవదాస్ (హైదరాబాదు-2)

'ఎక్కడివి పాలు?' కత్తితో అక్షరాలుగా కోసినట్టు అడిగాడు గోపాలం.

'కుర్రాడు తెచ్చాడు.'

'నాకీఅలవాటుందని ఎట్లా తెలుసు?'

'అత్తయ్య చెప్పారు.'

ఇంక గోపాలానికి మాటలులేవు. పాలు గటగటా తాగేసి లాంచీటాపుమీదికి వెళ్లాడు. టాపుమీద కుర్రాళ్లు ఒక్కొక్కళ్లే కిందికి పడుకుంటున్నారు. రాత్రి పదకొండు దాటింది. ఒడ్డుమీద చీకట్లో కీచురాళ్లు అరుస్తున్నాయి. చీకట్లో కృష్ణ నల్లతాచులా పాకిపోతూంది.

'వరలక్ష్మి ఒంటరిగా భయపడుతూందేమో' అనుకొన్నాడు గోపాలం.

'తనకు బతుకంటేనే భయంగాలేదు' అని పించింది.

అయినా చూద్దామని టాపుదిగి కాబిన్‌లోకి తొంగిచూశాడు. మసక వెలుగులో జోగుతూ కూర్చున్న వరలక్ష్మి కన్పించింది. అన్నంతిన్న సూచనలు లేవు. అలికిడి గమనించి వరలక్ష్మి దిగ్గున లేచి నుంచుంది.

'నేను పైన పడుకుంటున్నాను' అని వెళ్లి పోతూ ఎందుకో ఆలోచించి గోపాలం ఇలా అన్నాడు: 'నువ్వు అన్నం తిన్నట్టు లేదు. నువ్వు పస్తుండటం నాకేం సుఖం కాదు.'

గోపాలం వెనక్కు తిరిగిన వెంటనే ఖంగున వరలక్ష్మి గొంతులో ఎక్కిళ్లు మోగినై. వెక్కిపట్టిన ఏడుపు వినిపించింది. గోపాలం తిరిగి చూడదల్చుకోలేదు. టాపు మీదికి వచ్చే శాడు. వరలక్ష్మిలో పెల్లుబికిన దుఃఖం గోపా లాన్ని నీడలా వెంటాడుతూంది.

'తను ఆమెను కోత పెడుతున్నాడా?' అను కున్నాడు గోపాలం.

'ఆమెవల్ల తను రంపపుకోత పడటంలేదూ?'

'ఆమెను హింసించటం న్యాయమేనా?'




చలవచేసి
హాయి నిచ్చును

ఈ పరిమళ ఆయుర్వేద హెర్ ఆయిల్ (తలనూనె) – బెంగాల్ కెమికల్స్‌వారి పెర్‌ఫ్యూమ్డ్ బ్రాహ్మీ హెర్ ఆయిల్. శిరోజ ములు ఒత్తుగా పెరుగును. మెదడుకు చలవచేసి నరాలకు హాయి నిచ్చును. దీనిని నిత్యమూవాడిన మెదడుకు అలసట వుండదు. హాయిగా నిద్రపట్టును. ఎక్కువ మానసిక ప్రయాస, శ్రమగలవారికి ఎంతో మంచిది.




బెంగాల్ కెమికల్ వారి వస్తువు

NATIONAL-CAL-8-40TG

# అవతలి గట్టు

'నా బతుకు నే బతకడం కూడా ఆమెను హింసించటమేనా?'

'ఆమెను పెళ్లిచేసుకున్నాక ఆమెతో కలిసి కదా బతకాల్సింది?'

'అది నాకు చేతకాదు.'

'అన్యాయం! కాఠిన్యం!'

'నాకు ఇష్టంలేని పని చేస్తూ, కృతకంగా బతకటం న్యాయమా?'

'ఆమె నిన్ను నమ్ముకుంది.'

'నన్ను ముళ్లకంప కావలించుకుని నిన్నే నమ్ముకున్నానంటే నేనేం చేసేది?'

గోపాలం దీనంగా తలెత్తి ఆకాశంలోకిచూశాడు. అక్కడ విచ్చలవిడిగా చిమ్మిన లక్షల, కోట్ల నక్షత్రాలు, తన్ను చూసి నవ్వుతున్న నక్షత్రాలు. చూడలేక తల మోకాళ్లమధ్య ఇరికించుకున్నాడు గోపాలం.

భళ్లున తెల్లవారింది.

వెంకటసామి, గోపాలం పొద్దున్నే ఊళ్లో కెళ్లారు. ఏరువాక సమయం కావటంవల్ల ఎంత డబ్బిస్తామన్నా బండి కట్టమంటే కట్ట మన్నారు. ఇక పడవే శరణ్యం అనుకుని వెతగ్గా, చివరికి ఒక గూడు పడవ కుదిరింది. పడవ సరంగు మధ్యాహ్నాని కొచ్చేటట్లుగా మాట్లాడుకుని, కూరలూ, పెరుగూ తీసుకొని లాంచీ దగ్గరి కొచ్చేశా రిద్దరూ.

మధ్యాహ్నం రావలసిన పడవ సాయంత్రం నాలుగింటికొచ్చింది. పడవలోకి సామానంతా చేర్చి వెంకటసామి దగ్గర సెలవుతీసుకొని పడ వెక్కారు గోపాలం, వరలక్ష్మి. పడవ మెల్లగా సాగింది. నాలుగు మైళ్లు పోయి ఈ రాత్రికి మజిలీ చేద్దామని మిగతా ఆరు మైళ్లు రేప్పొద్దున లాగిద్దామని చెప్పాడు పడవ సరంగు. పడవ సరంగు ఏభై పైబడ్డ వాడు. సరంగు, అతని కూతురు ఇద్దరూ ఆ పడవలోనే ఉంటారు. అదే వాళ్ల ఇల్లు; అందులోనే కాపురం. తండ్రి గడవేస్తూంటే కూతురు చుక్కాని పడుతూంది. పడవ గుడిసెలో ఉన్న పొయ్యి సరిచేస్తూ సాయంత్రం వంటకు తయారవుతూంది వరలక్ష్మి.

'అన్నంలోకేం చెయ్యమంటారు?' అంది వరలక్ష్మి.

'నాకు తెలియదు' అని లేచి గూడుమంచి బయటకొచ్చేశాడు గోపాలం.

'ఏం చెయ్యమంటారు?—అన్నీ నా కిష్టమైనవి అమరుస్తున్నట్లు'— అనుకున్నాడ గోపాలం.

'అమర్చటం లేదా?'

'అసలెందుకు అమర్చటం?'

'భార్య కాబట్టి.'

'నా కక్కర్లేదు.'

'అంటే ఎక్కడికిపోతుంది?'

'ఏట్లోకి.'

గోపాలం వెనక్కు తిరిగిచూశాడు. చుక్కాని దగ్గర రంగురంగుల పూలపైట గాలి కెగురుతూంది. వరంగు కూతురు చుక్కానివడుతూ సన్నగా పదం పాడుతూంది. చుక్కాని వైపు నడిచి వచ్చాడు గోపాలం. వరంగు కూతురు గోపాలాన్ని చూసింది. గోపాలం 'ఇక్కడకూర్చోనా' అన్నాడు.

'కూకోటానిగ్గూడా అడగాల్నా!' నీళ్లు గల గల పారినట్లు నవ్వింది వరంగు కూతురు.

గోపాలానికి అంతరాంతరాల్లో చిత్రమైన సంచలనం కలిగింది. వరంగు గడవేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు. గోపాలం తలపైకెత్తి చూశాడు. అక్కడ వరంగు కూతురు కాటుకకళ్లు నవ్వుతున్నాయి. గోపాలం లేచి నుంచున్నాడు.

'లేచావేం బాబయ్యా' అంది వరంగు కూతురు. ఆమె ముఖంలోంచి నవ్వు ఇంకా మాయంకాలేదు. ఆ నవ్వు కలకాలం అలాగే ఉండాలనుకున్నాడు గోపాలం.

'నిన్ను చూద్దామని' అన్నాడు గోపాలం. మళ్లీ వరంగు కూతురు కెరటాలు కెరటాలుగా వెనక్కు విరుచుకుని నవ్వింది. నవ్వాక, 'ఎవరైనా సెప్పి సూస్తారా?' అంది ఓరగా చూస్తూ. గోపాలం గుండెలో పువ్వులు పూచినట్లయింది. పెద్దగా నవ్వాడు.

గడవేస్తూ ఈ చివరికొచ్చిన వరంగు, 'అది ఎర్రి బాగుల్ది బాబయ్యా! అట్టనే మాటలాడద్ది. నవ్వుకోమాకండి' అని గడవేస్తూ ఆ చివరి కెళ్లాడు.

నాలుగో మైలున పడవకు లంగరేసి విశ్రాంతి తీసుకుంటున్నాడు వరంగు.

వరంగు కూతురు 'కూరాకు ఏరుకొస్తా అయ్యా!' అంది తండ్రితో.

'తొందరగా రా' అన్నాడు వరంగు నల్లమందు మాత్ర మింగుతూ.

'నువ్వుకూడా వస్తావా బాబయ్యా! గట్టు సూపిస్త' అంది వరంగు కూతురు.

'పద' అన్నాడు గోపాలం తనుకూడా పడవ మీంచి గట్టుమీదికి దూకుతూ.

చెట్లు తొలగించుకుంటూ, చెంగున ఎగురుతూ, గాలికంటె ముందుగా రయ్యిన పరుగెత్తుతూంది వరంగు కూతురు. కొంత దూరాన ఆగి వెనక్కు తిరిగిచూసి 'నువ్వు నడవలేవా బాబయ్యా' అంది.

'నీలా పరుగెత్తలేను' అన్నాడు గోపాలం.

'నా నడకే అంత. పోనీ మెల్లంగ నడుస్తానే!' అంది ముఖం పక్కకు వంచి లాలనగాచూస్తూ.

గోపాలానికి ఆ చేపల్లాంటి కళ్లను ముద్దుపెట్టుకోవాలనిపించింది. ఆ కళ్లలో తన బొమ్మ చూసుకోవాలనిపించింది.

'అట్టా సూడకు బాబయ్యా' అంది బుంగ మూతి పెట్టి వరంగు కూతురు.

'ఏం?' అన్నాడు గోపాలం.

'నాకు భయం.'

'ఎందుకు?'

'ఏమో' అంది వరంగు కూతురు గాలిలో చెయ్యి విసురుతూ.

'మా మావకూడా అట్టాగే సూత్తాడు. నద్దన్నా ఇనడు' అంది.

'పోనీ నేను వింటాన్లే' అన్నాడు గోపాలం.

'నువ్వు మంచోడివి' అంది మురిపెంగా నవ్వి.

గోపాలానికి దేవతలు కరుణించినట్లనిపించింది.

వరంగు కూతురు తోటకూరచెట్లు పీకి 'ఇక పోదాం' అని బయలుదేరింది.

'అప్పుడే వెళ్దామా? కాసేపుండగూడదా' అన్నాడు గోపాలం. వెళ్తున్న వరంగు కూతురు వెనక్కు తిరిగి 'ఆకలెయ్యటంలా...పద పద' అంటూ ముందుకు నడిచింది.

గోపాలం చుక్కాని దగ్గర కూర్చున్నాడు. బాగా చీకటిపడింది. నక్షత్రాలు స్పష్టంగా వెలుగుతున్నాయి. వరంగు కూతురొచ్చి 'బాబయ్యా, అమ్మ పిలుస్తాంది' అని చెప్పింది.

గోపాలం పడవ గూడులోకి వెళ్లాడు. విస్తట్లో అన్నం వడ్డించి ఉంది. వరలక్ష్మి తలవంచుకు కూర్చుని ఉంది. గోపాలం అన్నం ముద్దలు గబ గబా మింగుతున్నాడు.

'మిమ్మల్ని కష్టపెడుతున్నాను' అంది వరలక్ష్మి నూతిలోని గొంతుకలా.

గోపాలం 'అవును. క...ష్టా...లు' విడగొట్టి పలుగు రాళ్లు విసిరినట్టు అన్నాడు.

వరలక్ష్మి కొంగు నోట్లో కుక్కుకుంది. ముఖం చేత్తో కప్పుకుంది.

గోపాలం గూడు బయటికొచ్చేశాడు. వరంగు అన్నంతిని నల్లమందు మత్తులో కూతురుతో మాట్లాడుతున్నాడు. గాలిలో మల్లెపూల వాసన గుప్పు మంది. వరంగు కూతురు ఎక్కడ సంపాదించిందో, మల్లెపూలు దండకట్టి తల్లో తురుముకోవటం గోపాలానికి కన్పించింది. గోపాలం ఆకాశంచూస్తూ వెల్లకితలా పడుకున్నాడు. ఆకాశం నిండా మల్లెలు, గాలిలో మల్లెలు. పడవ గూడులో వరలక్ష్మి పడుకుంటున్న చప్పుడయింది. వరంగు కూతురుతో ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు. గోపాలానికి చిన్న నిద్ర తెర తరువాత చటుక్కున మెలకువ వచ్చింది. పడవలో సవ్వడి లేదు. అంతా నిద్రపోయారు. ఒడ్డుమీద వరంగు కూతురు చీకట్లో లీలగా కన్పించింది. ముందుకు నడుస్తాంది. గోపాలం ఒడ్డుమీదికి దిగాడు. చీకట్లో దోవ కనిపించటంలేదు. మల్లె చెండు వాసన దోవగా వరంగు కూతుర్ని వెంబడించాడు. తుమ్మలతోపు అవతల వరంగు కూతురు ఆగిపోయింది. అక్కడ ఉన్న బండరాయిమీద కూర్చుంది. మత్తుగా పరచుకుంటున్న మసగ వెన్నెల్లో అభిసారికై కూర్చున్న వరంగు కూతుర్ని చూసి గోపాలం ఉత్తేజితుడైనాడు. ఆమె


డాక్టరు కండి



హోమియోపతి పోస్టుద్వారా నేర్చి ఎం. డి. హెచ్. డిప్లమో యివ్వబడును. విశిష్టమైనవృత్తి. జాబులు ఇంగ్లీషులోనే వ్రాయండి,

HIND HOMOEOPATHIC COLLEGE (W.A.P.)
Sonepat (Delhi)

ప్రత్యేక సందర్భములలో

పాంపియా

సువాసన ద్రవ్యములు వాడండి

పాంపియా సువాసనద్రవ్యముల విశిష్టమైన పరిమళం దశాబ్దాల తరబడి ప్రపంచమంతటా లక్షలాదిప్రజల ఆదరణ పొందినున్నవి.




International Franchises Pvt. Ltd.,
Kalina, Santacruz East, Bombay 25.

## నారసింహ లేహ్యం

బంగారు చేరినది. మేహము, నిక్కాక, నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలమును, రక్తవృద్ధిని కలిగించును.
20 తు డబ్బీ రు. 3–8–0.

## రోజాపుష్ప లేహ్యము

అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బీ రు.1-4-0; పోస్టేజి రు.1-1-0. మా క్యాటలాగు, కాలండరు ఉచితం. పి. సి. పి. అండ్ కో, ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.


# అవతలి గట్టు

పాదాల ముందు ప్రాణాలు ధారపోద్దా మనిపించింది. అలికిడి విని సరంగు కూతురు ఉలిక్కిపడి లేచింది.

'ఏ... ఏం బాబయ్యా ఇటొచ్చినావ్' అంది తడబడుతూ.

'నిద్ర పట్టలేదు' అన్నాడు గోపాలం ఆమె కళ్లల్లోకి చూస్తూ.

'నువ్వెందుకొచ్చావ్?' అతి మృదువుగా అడిగాడు గోపాలం.

'ఎందుకోలే! నువ్వెళ్లిపో బాబయ్యా' అంది అవుపించకుండా సిగ్గుపడుతూ.

'ఏం? నే నుండగూడదా?'

'ఊహుఁ.'

'ఎందుకని?'

'ఈడికి మా మావొస్తాడు' అంటూ సిగ్గుతో తల అవతలకు తిప్పుకుంది.

గోపాలానికి ఛెళ్లున కొరడాతో చరిచినట్లయింది. దిమ్మెరపోయాడు. కిందపడిపోకుండా తుమ్మచెట్టు పట్టుకున్నాడు. సరంగు కూతురు తన మావపేరెత్తినప్పుడు కలిగిన సిగ్గు దొంతర నుంచి ఇంకా తేరుకోలేదు. గోపాలం సర్రున వెనక్కుతిరిగి చకచకా నడిచాడు. ఒడ్డున నడుస్తూ గోపాలం భోరున ఏడవాలనుకున్నాడు. మనసిచ్చుకున్న చోటికివెళ్తే రక్కసముళ్లు పీకినాయి. గోపాలంలోని ప్రతి అణువులో జ్వాలలు పొగులుతున్నాయి. అతనికి వరలక్ష్మి జ్ఞాపకం వచ్చింది. సరిగ్గా ఇదే—తనకు మనసిచ్చింది. కాని ఆమె పొందిన ప్రతిఫలం?

గోపాలం పడవదగ్గరికి పరుగెత్తుకొచ్చాడు· గబగబా గూడులో దూరాడు. గుడ్డిదీపం వెలుగులో వరలక్ష్మి నిద్రపోతూంది. శాపం పొందిన దేవకన్యలా పడిఉంది. 'తను చేయని తప్పులకు శిక్ష అనుభవిస్తూ, పెట్టిన చిత్రహింసలకు బలిఅవుతూ తన్నే ఎందుకు నమ్ముకొంది!' అనుకొన్నాడు గోపాలం. వరలక్ష్మిని చేతుల్లోకి తీసుకొని గాఢంగా హృదయానికి హత్తుకోవాలనుకున్నాడు. 'పాపం! నిద్రలేస్తుందేమో' అనిపించింది గోపాలానికి. ముడివిడిపడి ఉన్న జడను ముద్దుపెట్టుకున్నాడు. నిశ్శబ్దంగా జడతడిసిపోయేలా రోదిస్తున్నాడు.

వరలక్ష్మి మెల్లగా కదిలింది. ఒక్క ఉదుటున లేచి గోపాలాన్ని చూసి గజగజ వణికిపోయింది. 'ఏ. . . ఏ . . నిటండీ?'

గోపాలం వరలక్ష్మిని కౌగిట్లో పొదివికొని అన్నాడు: 'నువ్వేమనుకుంటున్నావో నాకు తెలియదు. . . . ఏమనుకున్నావరే . . . . నిన్ను పూలతో పూజించుకుంటాను. . .'

వరలక్ష్మి తత్తరపడుతూ, 'అ . . అవేం మాటలు . . ' అంది.

'అవును . . నిజం . . నిజం . . నిన్ను విడిచి వెళ్లను . . నీతోనే ఉంటాను . . . నీకోసం ఉద్యోగం చేస్తాను . . .' గద్గదంగా అన్నాడు కన్నీటిధారల్లో ఆమె ముఖాన్ని పదేపదే చుంబిస్తూ.

మర్నాడు తొమ్మిది గంటలకు ముక్త్యాల రేవులో పడవ దిగుతూ, 'నేనీ గట్టు చేరలేక, మధ్యలోనే కొట్టుకుపోతానేమో అనుకున్నాను. కాని చేరాను' అంటూ గోపాలం వరలక్ష్మి చెయ్యి పట్టుకుని ఒడ్డెక్కాడు. ★


